క్లుప్తంగా

గిరిజన శక్తి రాష్ట్ర కోఆర్డినేటర్‌గా శివకుమార్



మోతె : గిరిజన శక్తి రాష్ట్ర కోఆర్డినేటర్‌గా మండలంలోని లాల్‌తండా గ్రామానికి చెందిన డాక్టర్ శివకుమార్‌నాయక్ నియమితులయ్యారు. బుధవారం స్థానికంగా శివకుమార్ విలేకరులతో మాట్లాడారు. గిరిజన శక్తి రాష్ట్ర అధ్యక్షుడు శరత్‌నాయక్ తనను నియమించినట్లు తెలిపారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన కృతజ్ఞతలు తెలిపారు. గిరిజనుల సమస్యలపై పోరాడుతానని అన్నారు. జిల్లాలో పోడు భూముల సమస్య పరిష్కారం కోసం మండలంలో ప్రతి తండా నుంచి గిరిజన శక్తి సంఘాన్ని ఏర్పాటు చేస్తానన్నారు.

ఆర్థికసాయం అందజేత



బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందిస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

మఠంపల్లి : మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకులంలో వంటమాస్టర్‌గా పనిచేస్తున్న రత్తారపు సైదులు మూడురోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ మంజుల, ఉపాధ్యాయులు గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.11వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో వైస్.ప్రిన్సిపాల్ సంయుక్త క్రిష్ణయ్య, వెంకటేశ్వర్లు, మట్టయ్య, రాధా, కళావతి, చంద్రావతి, బషీరాత్, నీలిమ, జయ, సురేందర్, యల్లయ్య పాల్గొన్నారు.

ఫొటో, వీడియోగ్రాఫర్ల సంఘం మండల అధ్యక్షుడిగా వెంకట్



పిల్లుట్ల వెంకట్‌ను సన్మానిస్తున్న ఫొటో, వీడియో గ్రాఫర్లు

కోదాడరూరల్ : కోదాడ మండల ఫొటో, వీడియో గ్రాఫర్ల మండల అధ్యక్షుడిగా సీనియర్ ఫొటోగ్రాఫర్ పిల్లుట్ల వెంకట్ నియమితులయ్యారు. బుధవారం స్థానిక రైస్ మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో జరిగిన ఆ సంఘ సమావేశంలో రాష్ట్ర, జిల్లా అధ్యక్షులు హుస్సేన్, లాలు సమక్షంలో వెంకట్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఫొటో, వీడియో గ్రాఫర్లు కలిసి కట్టుగా ఉండి సమస్యలను పరిష్కరించుకోవాలని అన్నారు. సంఘంలో ఉన్నవారందరిని భరోసా స్కీంలో చేర్పించాలని అన్నారు. నూతన అధ్యక్షుడు వెంకట్ మాట్లాడుతూ.. అందరి సహకారంతో సంఘం బలోపేతాని తనవంతు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఫొటో గ్రాఫర్ బొమ్మల వెంకన్న, మహేష్, రవి, ఫొటో, వీడియో గ్రాఫర్లు ఉన్నారు.

బూరుగడ్డ ఆలయంలో ప్రత్యేక పూజలు



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో ఉన్న శ్రీఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి దేవాయంలో బుధవారం సహస్ర నామఫల పుష్పార్చన బహుళ ఏకాదశి పూజలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం సుప్రభాతసేవ, ఆరాధన, అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం, సేవా కాలం, అలంకరణ, మంగళాశాసనం తీర్థప్రసాద వినియోగం తరదిర కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎంపీ లక్ష్మణరావు, అర్చకుడు హరీష్‌కుమార్ చార్యులు, భక్తులు పాల్గొన్నారు.

317 జీఓ బాధితులకు న్యాయం చేయాలి

గరిడేపల్లి : త్వరలో జరగబోయే ఉపాధ్యాయ పదోన్నతులు, బదిలీలు పారదర్శకంగా జరగాలని, 317 జీఓ బాధితులకు పూర్తిస్థాయిలో న్యాయం చేయాలని ఎస్‌టీయూ సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి ఓరుగంటి నాగేశ్వర్ రావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం ఆయన స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. నూతన జిల్లాల ఏర్పాటు తరువాత కేడర్ స్ట్రెంత్ విభజనలో భాగంగా జిల్లా స్థానికతను చూడకుండా వందల సంఖ్యలో జూనియర్ ఉపాధ్యాయులను తమ అభిష్టానానికి భిన్నంగా బదిలీలు చేశారని, ప్రస్తుతం బదిలీల ప్రక్రియలో వారికి తగిన విధంగా న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

రేపు పశువైద్య శిబిరం

మఠంపల్లి : మఠంపల్లిలోని పశు వైద్యశాలలో ఈనెల 20న నిర్వహించనున్న పశువైద్య శిబిరాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి డా.కట్టా శంకర్ బుధవారం కోరారు. పశువులకు సంక్రమిస్తున్న గర్భకోశ సంబంధ వ్యాధులకు చికిత్సలు నిర్వహించేందుకు ప్రభుత్వం వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తుందన్నారు. ఆయన వెంట గోపాలమిత్రలు, తదితరులున్నారు.

చిలుకూరులో డాక్టర్ లేక ఇబ్బందులు

- ఏడాదిగా రెగ్యులర్ వైద్యుడిని నియమించని ప్రభుత్వం
- కాంట్రాక్ట్ వైద్యురాలు సైతం సెలవులో..
- రోగులొస్తే మందులిచ్చి పంపిస్తున్న వైద్య సిబ్బంది



చిలుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

చిలుకూరు : అన్ని ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందంగా తయారైంది చిలుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిస్థితి. వైద్యశాలలో వైద్య సిబ్బంది, ప్రభుత్వం అందించే మందులు, సౌకర్యాలు అన్ని ఉన్నాయి. కానీ పేద ప్రజలకు జబ్బు చేసినప్పుడు వైద్యం అందించడానికి అసలు డాక్టరే లేరు. దీంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రైవేటు ఆస్పత్రికి పోలేక సమస్యను వైద్య సిబ్బందికి వివరించి వారిచ్చే మందులను తీసుకెళ్లి వాడాల్సిన పరిస్థితి నెలకొంది. మరోపక్క డాక్టర్ లేకపోవడంతో కొందరు ప్రైవేటు హాస్పిటల్స్‌ను సంప్రదించి వేలకు వేలు నష్టపోతున్నారు.

ఏడాది నుంచి..

కాగా, చిలుకూరు ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న డాక్టర్ ప్రమోద్‌కుమార్ ఏడాది క్రితం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి బదిలీ అయ్యారు. ఆనాటి నుంచి ఇక్కడ నేటివరకు రెగ్యులర్ డాక్టర్‌ను నియమించలేదు. అయితే డాక్టర్ ప్రమోద్‌కుమార్ బదిలీ అయిన కొన్ని నెలల తర్వాత కాంట్రాక్ట్ పద్ధతిలో డాక్టర్ తేజస్విని వచ్చారు. కానీ, ఆమె నెలరోజుల క్రితం వ్యక్తిగత కారణాల దృష్ట్యా సెలవు పెట్టారు. దీంతో నెల రోజుల నుంచి ఆస్పత్రిలో డాక్టర్ లేరు.

ప్రతిరోజూ వందమందికి పైగా రోగులు..

అయితే ఈ పీహెచ్‌సీకి మొదటి నుంచే రోజుకు 100 మందికి పైగా రోగులు వస్తుంటారు. ప్రస్తుతం డాక్టర్ లేకపోవడంతో తగ్గుముఖం పట్టారు. ఇక వైద్యశాలలో ఒకరు ల్యాబ్ టెక్నిషియన్, ఫార్మసిస్టులు ఉన్నారు. అయితే ఇటీవల జిల్లా వ్యాప్తంగా డాక్టర్ల బదిలీలు జరిగినా.. చిలుకూరు వైద్యశాలలో రెగ్యులర్ డాక్టర్ లేరనే విషయాన్ని మాత్రం ప్రభుత్వం మరిచింది. ఇప్పటికైనా జిల్లా స్థాయి అధికారులు స్పందించి చిలుకూరు వైద్యశాలకు డాక్టర్‌ను నియమించాలని మండల ప్రజలు, ప్రజాప్రతినిధులు కోరుతున్నారు. ఈ విషయంపై వైద్యశాల సిబ్బందిని వివరణ కోరగా బదిలీల సమయంలో చిలుకూరు వైద్యశాలకు డాక్టర్‌ను నియమించలేదని, ఉన్న డాక్టర్ కాస్త సెలవుపై వెళ్లారని తెలిపారు.

రెగ్యులర్ డాక్టర్‌ను నియమించాలి



చిలుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రెగ్యులర్ డాక్టర్‌ను తక్షణమే నియమించాలి. నెల రోజులుగా వైద్యశాలలో డాక్టర్ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఏ చిన్న ఆరోగ్య సమస్య వచ్చినా ప్రైవేట్ ఆస్పత్రులకు ఆశ్రయించి వేలకు వేలు నష్టపోతున్నారు.

– గోగుల వీరభద్రయ్య, చిలుకూరు

కోటిరెడ్డి కుటుంబానికి 'గుత్తా' పరామర్శ



రామనర్సమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి, తదితరులు

పాలకవీడు : మండలంలోని గుడుగుంట్లపాలెం గ్రామానికి చెందిన పుట్టూరి కోటిరెడ్డి మాతృమూర్తి పుట్టూరి రామనర్సమ్మ దశదినకర్మను బుధవారం నిర్వహించారు. కాగా ఖమ్మంలో జరిగే బీఆర్‌ఎస్ ఆవిర్భావ సభకు వెళ్తున్న శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి మార్గ మధ్యలో తన కుటుంబ సన్నిహితుడైన కోటిరెడ్డి ఇంటికి వెళ్లి వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా రామనర్సమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఖమ్మంకు వెళ్లారు. ఆయన వెంట దామరచర్ల జెడ్పీటీసీ, ఎంపీపీలు లలిత హతీరాం, నందిని రవితేజ, గుడిపాటి సైదులు, సైదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేశాన్ని దోచుకోవాలని చూస్తున్న కేసీఆర్



మాట్లాడుతున్న వేముల శేఖర్‌రెడ్డి

హుజూర్‌నగర్‌రూరల్ : టీఆర్‌ఎస్ పేరుతో ఇప్పటివరకు తెలంగాణ రాష్ట్రాన్ని దోచుకున్న కేసీఆర్ కుటుంబం ఇప్పుడు బీఆర్‌ఎస్ పేరుతో దేశాన్ని సైతం దోచుకోవాలని చూస్తుందని, అందుకే బీఆర్‌ఎస్ పార్టీని పెట్టారని బీజేపీ హుజూర్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ వేముల శేఖర్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం మండల పరిధిలోని అమరవరంలో నిర్వహించిన ఆ పార్టీ బూత్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలు చాలా తెలివి గల వారని బీఆర్‌ఎస్‌కు తగిన బుద్ధి చెబుతారని అన్నారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి ఉద్దోజు జగన్, హుజూర్‌నగర్, మఠంపల్లి మండలాల అధ్యక్షులు కుందురు కోటిరెడ్డి, యల్లయ్య, సింగతల వీరారెడ్డి, నారపరెడ్డి, వెంకటేశ్వర్లు, వెంకన్న పాల్గొన్నారు.

హనుమారెడ్డి మృతి బాధాకరం



హనుమారెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న శశిధర్‌రెడ్డి



ఎస్పీ కోటిరెడ్డిని పరామర్శిస్తున్న పద్మావతి

మునగాల : మండలంలోని మాధవరం గ్రామానికి చెందిన నంద్యాల కోటిరెడ్డి (వికారాబాద్ ఎస్పీ) తండ్రి హనుమారెడ్డి మృతి బాధాకరమని బీఆర్‌ఎస్ కోదాడ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జ్ కన్మతరెడ్డి శశిధర్‌రెడ్డి అన్నారు. బుధవారం అనారోగ్యంతో హనుమారెడ్డి(92)మృతి చెందారు. ఆయన చిత్రపటానికి శశిధర్‌రెడ్డి నివాళులర్పించి, ఎస్పీ కోటిరెడ్డిని పరామర్శించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు తుపాకుల భాస్కర్, నాయకులు బొలిశెట్టి నాగేంద్రబాబు, బండ్ల కోటయ్య తదితరులు ఉన్నారు.

ఎస్పీ కోటిరెడ్డికి పరామర్శ..

వికారాబాద్ ఎస్పీ నంద్యాల కోటిరెడ్డిని బుధవారం కోదాడ మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు నలమాద పద్మావతి పరామర్శించారు. అనంతరం హనుమారెడ్డి అంత్యక్రియలో పాల్గొన్నారు.

గోపయ్య మృతి పార్టీకి తీరని లోటు

హుజూర్‌నగర్‌రూరల్ : కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పోలె గోపయ్య మృతి పార్టీకి తీరని లోటని కోదాడ మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు నలమాద పద్మావతిరెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని అమరవరంలో పోలె గోపయ్య మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఇటీవల మృతి చెందిన మాజీ డిస్ట్రిబ్యూటర్ కమిటీ చైర్మన్ ఉస్తెల సైదిరెడ్డి తల్లి రాములమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె వెంట మాజీ ఎంపీపీ బచ్చలకూరి మట్టయ్య, మాజీ సర్పంచ్ లింగారెడ్డి, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

తిరుపమ్మకు నివాళి..

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌లోని అంబేడ్కర్ కాలనీకి చెందిన మెరిగ తిరుపమ్మ బుధవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న టీపీసీసీ ఉపాధ్యక్షురాలు, కోదాడ మాజీ ఎమ్మెల్యే పద్మావతి ఆమె మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె కుటుంబసభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఆమెవెంట కౌన్సిలర్లు శ్రవణ్, రాజానాయక్ తదితరులున్నారు.

విద్య, వైద్య రంగానికి నిధులు కేటాయించాలి



సంతకాల సేకరణలో పాల్గొన్న న్యాయవాదులు

హుజూర్‌నగర్ : విద్య, వైద్య రంగానికి కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించాలని పలువురు న్యాయవాదులు అన్నారు. బుధవారం తెలంగాణ పవర్ స్పందన వేదిక ఆధ్వర్యంలో హుజూర్‌నగర్‌లోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగానికి పదిశాతం, వైద్యరంగానికి ఆరుశాతం నిధులను కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వేదిక జిల్లా కార్యదర్శి క్రాంతికుమార్, డివిజన్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, న్యాయవాదులు సత్యనారాయణ, మాధవరెడ్డి, రవికుమార్, అంజయ్య, రమణారెడ్డి, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం సభకు తరలిన బీఆర్‌ఎస్ శ్రేణులు



హుజూర్‌నగర్ : జెండా ఊపి వాహనాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సైదిరెడ్డి

కోదాడ : బీఆర్‌ఎస్ సభతో దేశ రాజకీయాల్లో మార్పు వస్తుందని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. బుధవారం ఖమ్మంలో నిర్వహించిన బీఆర్‌ఎస్ ఆవిర్భావ సభకు కోదాడ నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, వాహన ర్యాలీని ప్రారంభించారు.

బీఆర్‌ఎస్‌తోనే దేశంలో అభివృద్ధి సాధ్యం

హుజూర్‌నగర్/హుజూర్‌నగర్‌రూరల్ : బీఆర్‌ఎస్‌తోనే దేశంలో అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. బుధవారం ఖమ్మంలో నిర్వహించిన బీఆర్‌ఎస్ ఆవిర్భావ సభకు హుజూర్‌నగర్ నుంచి పార్టీ శ్రేణులు తరలివెళ్లారు. హుజూర్‌నగర్‌తో పాటు వేపలసింగారంలో వాహనాల ర్యాలీని ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ము డెం గోపి రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నడిగూడెం : ఖమ్మం సభకు మండలం నుంచి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. మండల అధ్యక్షుడు పల్లా నర్సిరెడ్డి, బడేటి చంద్రయ్య, ఎంపీపీ జ్యోతి, జెడ్పీటీసీ కవిత, వైఎస్ ఎంపీపీ వెంకటేశ్వర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులున్నారు.

మేళ్లచెరువు : ఖమ్మం బీఆర్‌ఎస్ ఆవిర్భావ సభకు మండలంలోని వివిధ గ్రామాల నుంచి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు.

మోతె : ఖమ్మం సభకు మోతె మండలం నుంచి బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు శీలం సైదులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేరేడుచర్ల : ఖమ్మంలో జరిగే బీఆర్‌ఎస్ అవిర్భావ సభకు నేరేడుచర్ల మండలం, మున్సిపాలిటీ నుంచి భారీగా నాయకులు, కార్యకర్తలు బుధవారం లారీలు, కార్లు, డీసీఎంలలో తరలివెళ్లారు. వాహనాలను బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సురేష్‌బాబు, పట్టణ అధ్యక్షురాలు చల్లా శ్రీలతారెడ్డిలు ప్రారంభించారు. మున్సిపల్ చైర్మన్ చందమళ్ల జయబాబు, ఎంపీపీ లకుమళ్ల జ్యోతి, జెడ్పీటీసీ నర్సయ్య, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తదితరులున్నారు.

గరిడేపల్లి : బీఆర్‌ఎస్ అవిర్భావ సభకు మండలం నుంచి బీఆర్‌ఎస్ కార్యకర్తలు, నాయకులు బుధవారం పలు వాహనాలలో భారీగా తరలివెళ్లారు. ఎంపీపీ పెండెం సుజాతశ్రీనివాస్‌గౌడ్ జెండాను ఊపి వాహన ర్యాలీని ప్రారంభించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ కడియం వెంకట్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు గుగులోతు కృష్ణనాయక్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు ఉన్నారు.

మఠంపల్లి : బీఆర్‌ఎస్ సభకు మండలం నుంచి ఎంపీపీ పార్వతీకొండానాయక్, జెడ్పీటీసీ జగన్ నాయక్, మండల అధ్యక్షుడు పిచ్చయ్య, సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపీపీలు లక్ష్మీవెంకటనారాయణ, కొండానాయక్, నాయకులు క్రిష్ణంరాజు, లక్ష్మీనరసింహరాజు, నాగయ్యయాదవ్, వెంకరమణ తదితరులు వెళ్లారు.

చిలుకూరు : ఖమ్మంలో జరిగిన బీఆర్‌ఎస్ బహిరంగ సభకు బుధవారం చిలుకూరు మండలం నుంచి 5 వేల మందికి పైగా బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. డీసీసీబీ డైరెక్టర్ కొండా సైదయ్య, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు జానివిఎయా, నలబోలు శ్రీనివాస్‌రెడ్డి, దొడ్డా సురేష్‌బాబు, బజ్జూరి వెంకట్‌రెడ్డి, అన్నపూర్ణ, శివాజీ నాయక్, జనార్దన్, సైదులు, నర్సయ్య పాల్గొన్నారు.

కోదాడరూరల్ : ఖమ్మం సభకు మండలంలోని పలు గ్రామాల నుంచి బీఆర్‌ఎస్ నాయకులు, కారకర్తలు భారీగా తరలి వెళ్లారు. గుడిబండలో వాహన ర్యాలీని ఎంపీపీ చింత కవితారాధారెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. శంరశెట్టి కోటేశ్వరరావు, శెట్టి సురేష్, సాధినేని అప్పారావు, లక్ష్మీనారాయణ, కిరణ్, శ్రీకాంత్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మునగాల : ఖమ్మంలో బీఆర్‌ఎస్ తొలి బహిరంగ సభలో పాల్గొనేందుకు బుధవారం మండల వ్యాప్తంగా సుమారు 50 వాహనాలలో ఐదువేల మంది కార్యకర్తలు తరలివెళ్లారు. మండల కేంద్రంలో వాహనాల ర్యాలీని మండల పార్టీ నాయకుడు నల్లపాటి శ్రీనివాస్ జెండా ఊపి ప్రారంభించారు. మండల పార్టీ అధ్యక్షుడు తొగరు శ్రీనివాస్, స్థానిక సర్పంచ్ చింతకాయల ఉపేందర్, గ్రామశాఖ అధ్యక్షుడు ఉడుం కృష్ణ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సొసైటీ చైర్మన్లు, నాయకులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి



చిలుకూరులో కంటి వెలుగు క్యాంపును ప్రారంభిస్తున్న తహసీల్దార్, ఎంపీడీఓ, ఎంపీఓ



నేరేడుచర్ల : సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ చందమళ్ల జయబాబు



కోదాడరూరల్ : కంటివెలుగు కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, వైద్య సిబ్బంది



నడిగూడెం : వల్లాపురంలో కంటివెలుగు కార్యక్రమం ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

కోదాడరూరల్ : కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ విజయశ్రీ అన్నారు. బుధవారం మండల పరిధిలోని అడ్లూరులో కంటి వెలుగు శిబిరాన్ని ఆమె పరిశీలించి మాట్లాడారు. కంటి వెలుగు కార్యక్రమంలో కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు, అద్దాలు అందజేస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ తుమ్మల నాగేశ్వరావు, డాక్టర్ ధర్మతేజ సూపరింటిండెంట్ రామచందర్‌రావు, కార్యదర్శి అల్లుపల్లి కావ్య తదితరులు ఉన్నారు.

చిలుకూరులో 'కంటి వెలుగు' ప్రారంభం

చిలుకూరు : చిలుకూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం కంటి వెలుగు కార్యక్రమాన్ని తహసీల్దార్ రాజేశ్వరి, ఎంపీడీఓ ఈదయ్యలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మండలవ్యాప్తంగా నిర్వహించే కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ పాండు యాదవ్, సర్పంచ్ కొడారు బాబు, సీహెచ్‌ఓ వినోద్, హెల్త్ అసిస్టెంట్ శ్రీను, కార్యదర్శి శోభన్‌బాబు, వార్డు సభ్యులు, గ్రామ పంచాయతీ సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను విజయవంతంగా నిర్వహించాలి

నేరేడుచర్ల : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని మున్సిపల్ చైర్మన్ చందమళ్ల జయబాబు కోరారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో కలిసి కంటి వెలుగు కార్యక్రమంపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. నేరేడుచర్ల మార్కెట్ కార్యాలయంలో ఈనెల 19వ తేదీన హుజూర్‌నగర్ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. మున్సిపాలిటీలోని 15 వార్డుల్లో ఈనెల 19 నుంచి మార్చి 24 వరకు కంటివెలుగు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, వైద్యాధికారి సీతామహాలక్ష్మి, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు ఉన్నారు.

కంటి వెలుగు ఏర్పాట్ల పరిశీలన

నడిగూడెం : మండలంలో గురువారం నుంచి నిర్వహించే కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రత్యేక అధికారులు డాక్టర్.కళ్యాణ్‌చక్రవర్తి, తంగెళ్ల వాసు కోరారు. బుధవారం మండల పరిధిలోని వల్లాపురంలో కంటి వెలుగు కార్యక్రమ ఏర్పాట్లను పరిశీలించి మాట్లాడారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని అన్నారు. ఆరోగ్య, ఆశ కార్యకర్తలు గ్రామాలలో ప్రజలను చైతన్యం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ యం.యర్రయ్య, ఎంపీఓ ఎర్ర లింగారెడ్డి, త్రిపురవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్.లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

ఎన్టీఆర్ సేవలు చిరస్మరణీయం



కోదాడరూరల్ : ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు



చిలుకూరు : రామాపురంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న టీడీపీ నాయకులు

మునగాల : మాజీ సీఎం, ప్రముఖ నటుడు స్వర్గీయ నందమూరి తారకరామారావు 27వ వర్ధంతిని బుధవారం మండలంలోని నర్సింహాపురంలో సామాజిక ఉద్యమకారుడు డాక్టర్ వేమూరి సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహానికి గజమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వేమూరి సత్యనారాయణ మాట్లాడారు. ఎన్టీఆర్ సేవలు చిరస్మరణీయమని అన్నారు. కార్యక్రమంలో కసమర్లపూడి శ్రీనివాసరావు, బొమ్మ చినవెంకన్న, కారింగుల సైదులు, బారి లక్ష్మయ్య, చెర్వుపల్లి శ్రీనివాస్, లింగయ్య, చినరామయ్య, శ్రీను, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

కోదాడరూరల్ : మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ ఎన్టీ రామారావు వర్ధంతి సందర్భంగా బుధవారం పట్టణంలోని ఖమ్మం క్రాస్‌రోడ్, మున్సిపాలిటీ పరిధిలో గల ఎన్టీఆర్ విగ్రహాలకు టీడీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండలంలోని కాపుగల్లులో ఎన్‌టీఆర్ వర్ధంతి నిర్వహించారు. ఆ పార్టీ రాష్ట్ర నాయకులు తొండపు సతీష్, నంబూరి సూర్యం, పట్టణ అధ్యక్షుడు ఉప్పగండ్ల శ్రీనివాస్, పిడతల శ్రీనివాసరావు, సైదేశ్వరావు, నరేష్, హనుమంతరావు, శోభన్‌బాబు ఉన్నారు.

నడిగూడెం : మాజీ సీఎం ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలో బుధవారం టీడీపీ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గుండు నాగేశ్వరరావు, దేవరంగు వీరన్న, గుడిపల్లి సీతయ్య, గోలి వెంకటేశ్వర్లు, అచ్చయ్య, దుర్గారావు, ఖాసీం పాల్గొన్నారు.

మఠంపల్లి : మండలంలో ఎన్టీఆర్ వర్ధంతిని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మఠంపల్లి, చౌటపల్లిలలో ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక పీహెచ్‌సీలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు నాగునాయక్, వెంకటరామ్‌నాయక్, లక్ష్మణ్, వెంకట్‌రెడ్డి, నరేందర్, సతీష్, మహేష్, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

చిలుకూరు : మండల కేంద్రంతో పాటు రామాపురంలో బుధవారం మాజీ సీఎం ఎన్టీఆర్ వర్ధంతిని టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సాతులూరి గురవయ్య, నాయకులు ఓరుగంటి ప్రభాకర్, కొల్లు నర్సయ్య, జనపనేని కృష్ణారావు, వేమూరి సురేష్, కొండా సోమయ్య, కొల్లు సత్యనారాయణ, శ్రీమన్‌నారాయణ, శ్రీను, వీరబాబు, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

గరిడేపల్లి : మండల కేంద్రంతో పాటు అబ్బిరెడ్డిగూడెంలో బుధవారం ఎన్టీఆర్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటం, విగ్రహానికి టీడీపీ నాయకులు నివాళులర్పించారు. అనంతరం పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు నాగయ్య, లింగారెడ్డి, రమేష్, మస్తాన్, రంజాన్, నర్సింహ, లింగయ్య తదితరులున్నారు.

నేరేడుచర్ల : ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా బుధవారం నేరేడుచర్ల ప్రధాన కూడలిలో ఎన్టీఆర్ చిత్రపటానికి టీడీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు పాల్వాయి రమేష్, ఇంజమూరి వెంకటయ్య, పానుగోటి జంగయ్య, కుంటిగొర్ల రామచంద్రయ్య, యడవల్లి వెంకట్‌రెడ్డి, వెంకన్నయాదవ్, సైదాచారి తదితరులున్నారు.

హుజూర్‌నగర్ : ఎన్టీఆర్ వర్ధంతిని బుధవారం హుజూర్‌నగర్‌లో టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆ పార్టీ నాయకులు మండవ వెంకటేశ్వర్లు, రోషపతి, భాగ్యమ్మ, వెంకటేశ్వర్లు, సైదులు, సతీష్ తదితరులున్నారు.

గీత కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి



గీత కార్మికులకు గుర్తింపు కార్డులు అందజేస్తున్న జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి అనిత

నేరేడుచర్ల : గీత కార్మికుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి అనిత అన్నారు. బుధవారం సూర్యాపేట కార్యాలయంలో నేరేడుచర్ల మండలంలోని సోమారం గ్రామానికి చెందిన 40 మంది గీత కార్మికులకు గుర్తింపు కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గీత కార్మికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గీత కార్మికులు వల్లపుదాసు వెంకటేశ్వర్లు, నాగరాజు, వెంకన్న, కృష్ణయ్య, సైదులు, అశోక్, అరవింద్ తదితరులున్నారు.

రివాల్వింగ్ చైర్ బహూకరణ

మోతె : మండల తహసీల్దార్ కార్యాలయానికి మండలంలోని ఉర్లుగొండ గ్రామానికి చెందిన దాత కొండ్రు మల్లికార్జున్ సుమారు రూ.15 వేల విలువ గల రివాల్వింగ్ చైర్‌ను బహూకరించారు. ఆయన వెంట ఆర్‌కే నాయక్, సీతా రాములు, రామ్మూర్తి, వేణు, సతీష్ ఉన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత



బాధిత కుటుంబానికి నగదు, నిత్యావసర సరుకులు అందజేసిన దాతలు

మోతె : మండలంలోని హుస్సేన్‌బాద్ గ్రామ సమీపంలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో రాంపురంతండాకు చెందిన ఓర్సు రాయుడు, దేవి దంపతులు మృతి చెందారు. దీంతో అనాథలైన వారి ముగ్గురు పిల్లలకు బుధవారం విభళాపురం గ్రామ 'మన ఆపద్బాంధవుల ఫౌండేషన్' ఆధ్వర్యంలో 50 కేజీల బియ్యం, నిత్యావసర సరుకులను రాంపురంతండాలో అందజేశారు. అదేవిధంగా విభళాపురం గ్రామ యువజన నాయకులు గుండ్ల లక్ష్మారెడ్డి రూ.2 వేలు, తెప్పలి మధు రూ.వెయ్యి, గణేష్ రూ.3 వేలు అందజేసి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో విజయ్‌కుమార్, కుంబజడ బాబు, జంపాల రవి, నిమ్మల గురు, మొక్క రాజు, దోసల ఉపేందర్‌రెడ్డి ఉన్నారు.

అక్రమ కేసులు బనాయించడం హేయమైన చర్య



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి పత్తిపాటి విజయ్

హుజూర్‌నగర్ : బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ను రాజకీయంగా ఎదుర్కోలేక ఆయన కుమారుడిపై ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించడం హేయమైన చర్య అని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి పత్తిపాటి విజయ్ అన్నారు. బుధవారం హుజూర్‌నగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతున్న వారిపై అక్రమ కేసులు పెట్టి, ఇబ్బందులు పెట్టడం సరికాదని అన్నారు. తక్షణమే బండి సంజయ్ కుమారుడిపై బనాయించిన కేసు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఇంటి రవి, తదితరులున్నారు.